


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 03.08.2026 | సంపుటి: 3 | సంచిక: 181 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 03.08.2026 | V0LUME : 3 | ISSUE : 181 | PAGES: 8 | COST: 2/- |


# ఉజ్జయిని మహంకాళికి బంగారు బోనం



## ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న కేటీఆర్



- తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు
- బీఆర్ఎస్ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడి

2

## బోనాల వేడుకల్లో సందడి

- మంత్రి పొన్నం నివాసంలో సీఎం రేవంత్‌తో కలిసి హాజరైన ప్రముఖులు



- ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా సంప్రదాయబద్ధంగా వేడుకలు
- ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఆతిథ్యం ఇచ్చిన పొన్నం
- తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేక బోనాల విందు

2

- బోనాల మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రులతో కలిసి పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించిన ముఖ్యమంత్రి
- రాష్ట్ర ప్రజల సుఖశాంతి, సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారికి ప్రార్థనలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రత
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని వ్యాఖ్య

2





# కాళేశ్వరం బ్యారేజీల కింద సాంకేతిక లోపాలు?

- జీపీఆర్ పరీక్షల్లో భూగర్భ అసాధారణతల గుర్తింపు
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనం
- 217 వెంట్ల పరిశీలనలో పలు చోట్ల కేవిటీస్, సీపేజీ మార్గాల గుర్తింపు
- నిర్మాణ లోపాలపై తుది నిర్ధారణ కాదన్న పరిశోధనా సంస్థ
- మరిన్ని ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచన

హైదరాబాద్, ఆగస్టు 2

తెలంగాణలో రాజకీయంగా చర్చనీయాంశమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక సాంకేతిక అంశం వెలుగులోకి వచ్చింది. ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భ పరిస్థితులను అంచనా వేసేందుకు నిర్వహించిన గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) పరీక్షల్లో పలు ప్రాంతాల్లో అసాధారణ పరిస్థితులు గుర్తించినట్లు సమాచారం. ఈ పరిశీలనల ఆధారంగా పుణెలోని కేంద్ర జల,

మిగతా 3వ పేజీలో..



## పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 'భారత్ ఫ్యూచర్ సిటీ', 'తెలంగాణ రైజింగ్-2047'తో అభివృద్ధికి కొత్త దిశ
- విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు

3



3

## ప్రవాసుల కోసం హైదరాబాద్‌లో ఎన్ఆర్ఐ భవన్

- రూ.10 కోట్లతో నిర్మాణానికి కృషి చేస్తానన్న మంత్రి జూపల్లి
- అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల్లో ప్రవాసులతో సమావేశం
- తెలంగాణ పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు

## రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం

- ముందుగానే ₹1.09 లక్షల కోట్ల పన్నుల వాటా విడుదల
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆర్థిక వెసులుబాటు
- అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు ₹19,208 కోట్లు, బీహార్‌కు ₹10,845 కోట్లు
- ఆంధ్రప్రదేశ్‌కు ₹4,597 కోట్లు, తెలంగాణకు ₹2,370 కోట్లు
- సాధారణ షెడ్యూల్‌కు ముందే నిధులు విడుదల చేసిన కేంద్రం

3





3

## 6,307 మంది చిన్నారులకు విముక్తి



## హైడ్రాకు ప్రజా మద్దతు వెల్లువ

- ఏవీ రంగనాథ్ కొనసాగింపునకు కాలనీ సంఘాల డిమాండ్
- అమీర్‌పేట, మధురానగర్ ప్రాంతాల్లో భారీ ర్యాలీలు
- చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపును ప్రశంసించిన ప్రజలు
- హైడ్రాపై దుష్ప్రచారాన్ని ఖండించిన సంక్షేమ సంఘాలు

3

## మత్తు రహిత భారతానికి యువతే బలం

- '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్
- గచ్చిబౌలిలో యువత, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన శివ ప్రతాప్ శుక్లా
- మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు



3

## డ్రగ్స్ రహిత యువతతోనే వికసిత్ భారత్

- 'నశా ముక్త్ యువ' జాతీయ ప్రచారానికి శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ
- దేశవ్యాప్తంగా 100 వారాల పాటు అవగాహన కార్యక్రమాలు
- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రధాని పిలుపు
- 10 వేలకుపైగా ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం
- ప్రతి ఆదివారం క్రీడలు, వాక్‌థాన్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు

4





4

## జంతర్‌మంతర్ నిరసనల్లో అల్లర్ల కుట్ర?



4

## బారాముల్లాలో ఉగ్ర అనుమానితుడి అరెస్టు

- కశ్మీర్‌లో భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్
- షేరీ సెక్టార్‌లో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న బలగాలు
- ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- కుల్గాంలో వలస కార్మికుల హత్య కేసులో ముమ్మర గాలింపు





# ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న కేటీఆర్

- తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు
- బోనాలు తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు ప్రతీక అని వ్యాఖ్య
- బీఆర్ఎస్ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడి
- రైతుల సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవాలని మొక్కులు

హైదరాబాద్, ఆగస్టు 2

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న కేటీఆర్, బోనాల సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలందరూ కలిసికట్టుగా జరుపుకునే ఈ వేడుక తెలంగాణ సమాజ ఐక్యతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో బోనాలకు తగిన గుర్తింపు లభించలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని కేసీఆర్ తరచూ చెప్పేవారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి, పండుగలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో తెలంగాణ కళకళలాడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. రైతుల సంక్షేమం, ప్రజల సుఖశాంతి కోసం ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నానని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్న లష్కర్ బోనాలు తెలంగాణ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## బోనాల వేడుకల్లో సందడి

హైదరాబాద్, ఆగస్టు 2

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికార నివాసంలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బోనాల విందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, వివేక్ వెంకట స్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అతిథులకు తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఆప్యాయంగా స్వాగతం పలికారు. కార్యక్రమానికి వచ్చిన ప్రముఖులను స్వయంగా పలకరిస్తూ ఆతిథ్యం అందించారు. విందు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లి మల్లమ్మ, సతీమణి మంజుల, కుమారులు పృథ్వీ, ప్రణవ్‌తో పాటు కుటుంబ సభ్యులు, బంధువులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయం, ఆతిథ్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ ఆత్మీయ సమావేశం బోనాల సంబరాలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.



## బోనాల వేడుకల్లో అమెరికా కాన్సుల్ జనరల్ సందడి

- ఉజ్జయిని మహంకాళికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన స్వాగతం
- బోనాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశిష్టతను వివరించిన మంత్రి
- తెలంగాణ–అమెరికా సాంస్కృతిక బంధాలు మరింత బలోపేతమవుతాయన్న ఆశాభావం



హైదరాబాద్, ఆగస్టు 2:

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం లారా ఈ. విలియమ్స్ సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఉజ్జయిని మహంకాళి ఆలయ చారిత్రక విశిష్టతతో పాటు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను అమెరికా కాన్సుల్ జనరల్‌కు వివరించారు. తెలంగాణ ప్రజల భక్తి, విశ్వాసాలు, సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.

ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే లష్కర్ బోనాల ఉత్సవాల ప్రత్యేకత, బోనం సమర్పణ అనంతరం జరిగే సంప్రదాయ 'రంగం' కార్యక్రమం ప్రాముఖ్యతను కూడా ఆమెకు వివరించారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశంగా బోనాల ఉత్సవాలు నిలుస్తున్నాయని, అమెరికా కాన్సుల్ జనరల్ పాల్గొనడం రెండు ప్రాంతాల మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

బోనాల ఉత్సవాల్లో ప్రత్యక్షంగా పాల్గొని తెలంగాణ సంప్రదాయాలను దగ్గరగా అనుభవించడం ఆనందంగా ఉందని లారా ఈ. విలియమ్స్ పేర్కొన్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ నడుమ బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగాయి.




## ఉజ్జయిని మహంకాళికి బంగారు బోనం

హైదరాబాద్, ఆగస్టు 2

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి అర్చకులు, ఆలయ అధికారులు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం, తెలంగాణ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రంపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

లష్కర్ బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగగా, బోనాల సంబరాలు నగరమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కతో పాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఆలయ పరిసరాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ, రాష్ట్ర ప్రజలంతా ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.




## బోనాల భద్రతకు ఏఐ కవచం

- ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనర్
- కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న నగర పోలీస్ కమిషనర్
- 2,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు
- తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, ముఖ గుర్తింపు వ్యవస్థ వినియోగం
- భక్తుల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 2

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ భాగ్యనగరంలో బోనాల పండుగకు విశిష్ట చారిత్రక ప్రాధాన్యం ఉందన్నారు. గోల్కొండ, బల్కంపేట బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయని తెలిపారు.



ఉజ్జయిని మహంకాళి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందితో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భక్తుల భద్రత కోసం తొలిసారిగా కృత్రిమ మేధ ఆధారిత జన సమ్మర్ధ నిర్వహణ, నిఘా వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు.

ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలకు ముఖ గుర్తింపు సాంకేతికతను అనుసంధానించినట్లు సీపీ వివరించారు. దీని ద్వారా పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను వేగంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను నిరంతరం పర్యవేక్షిస్తూ, క్యూలైన్లలో రద్దీ పెరిగిన వెంటనే నియంత్రణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. తొక్కిసలాటలు వంటి ఘటనలు జరగకుండా అన్ని శాఖలతో సమన్వయంగా పని చేస్తున్నామని సజ్జనర్ తెలిపారు. దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల సహకారంతో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొంటూ, భక్తులు పోలీసు శాఖకు సహకరించి క్రమశిక్షణతో అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, ట్రాఫిక్ డీసీపీ అవినాశ్ కుమార్, అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





# పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- ప్రపంచ స్థాయి ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 'భారత్ ఫ్యూచర్ సిటీ', 'తెలంగాణ రైజింగ్-2047'తో అభివృద్ధికి కొత్త దిశ
- విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు
- రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలని పిలుపు

**హైదరాబాద్, ఆగస్టు 2**

తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ వేగవంతమైన అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా నిర్వహించిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసీ) ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణను ఎన్ఆర్ఐలు, విదేశీ ప్రతినిధులకు వివరించారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, వచ్చే ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ఈ దిశగా 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌ను అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు అనుబంధంగా ముచ్చర్లలో కాలుష్య రహిత నెట్ జీరో ప్రమాణాలతో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాన్ని కోర్ అర్బన్, పెరి అర్బన్, రూరల్ అగ్రి ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విస్తృత సంస్కరణలు చేపట్టామని భట్టి తెలిపారు. పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. టాటా గ్రూప్ సహకారంతో రూ.2,100 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక డిజిటల్ శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టేందుకు హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేశామని భట్టి పేర్కొన్నారు. మూసీ నదిని శుద్ధి చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేసే మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందులను ఎదుర్కొందని ఆరోపించిన భట్టి, ప్రజా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో పరిస్థితిని మెరుగుపరిచిందన్నారు. ప్రస్తుతం ప్రతి నెల తొలి తేదీన ఉద్యోగుల వేతనాలు జమ చేస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి నిర్ణయాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ విస్తరణ, అంతర్జాతీయ పెట్టుబడుల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమైందని భట్టి తెలిపారు. తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరిందని పేర్కొంటూ, అమెరికాలోని తెలుగు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మత్తు రహిత భారతానికి యువతే బలం

**హైదరాబాద్, ఆగస్టు 2:**

మత్తు రహిత భారతదేశమే వికసిత్ భారత్‌కు బలమైన పునాదిగా నిలుస్తుందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఆదివారం నిర్వహించిన '10 కోట్ల మాదక ద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత, విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'లో భాగంగా తెలంగాణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గవర్నర్ తెలిపారు. మాదకద్రవ్య రహిత భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు.

భారత యువతే దేశానికి అతిపెద్ద శక్తి అని పేర్కొన్న గవర్నర్, మాదకద్రవ్యాల బారిన పడకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, యోగా, ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యతతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన యువతతోనే బలమైన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు.

ఈ సందర్భంగా '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' ప్రచార పోస్టర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. తెలంగాణ వ్యాప్తంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రభుత్వం మాత్రమే కాకుండా విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాలని గవర్నర్ అన్నారు. యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.




# ప్రవాసుల కోసం హైదరాబాద్‌లో ఎన్ఆర్ఐ భవన్



**బాల్టిమోర్, ఆగస్టు 2:**

అమెరికా నుంచి తెలంగాణకు వచ్చే ప్రవాస భారతీయులకు అన్ని సేవలు ఒకే చోట అందుబాటులో ఉండేలా హైదరాబాద్‌లో ఎన్ఆర్ఐ భవన్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ భవన్ ప్రవాస భారతీయులకు సమన్వయ కేంద్రంగా ఉపయోగపడుతుందని అన్నారు. అమెరికాలోని బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణతో ప్రవాసుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యువత వ్యసనాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, మాదకద్రవ్యాలు, ఇతర సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు త్వరలో ప్రభాత భేరి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ సామాజిక ఉద్యమంలో ప్రవాస భారతీయులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**పర్యాటక అభివృద్ధిలో ఎన్ఆర్ఐల భాగస్వామ్యం**

తెలంగాణలో పర్యాటక రంగానికి అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, వారసత్వ సంపదను అమెరికన్ తెలుగు అసోసియేషన్ బృందాలు, ప్రవాస భారతీయ సంఘాలు దత్తత తీసుకుని అభివృద్ధి, పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. అమెరికాలోని తమ మిత్రులు, సహచరులకు తెలంగాణ పర్యాటక వైభవాన్ని పరిచయం చేయాలని సూచించారు. తాము పుట్టి పెరిగిన గ్రామాల అభివృద్ధికి ప్రవాసులు అందిస్తున్న సహకారం అభినందనీయమని జూపల్లి అన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో ఎన్ఆర్ఐలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్యం కోసం ప్రజలు తమ స్థాయికి మించి ప్రైవేటు సంస్థలపై ఖర్చు చేస్తున్నారని, ప్రభుత్వ రంగంలో విద్య, వైద్య సదుపాయాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని మంత్రి తెలిపారు.

**ఎన్ఆర్ఐ కమిటీతో ముఖాముఖి**

అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్ఆర్ఐ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రవాసుల సమస్యలు, సంక్షేమం, తెలంగాణతో వారి అనుబంధాన్ని పెంచే అంశాలపై చర్చించారు. విదేశాల్లోని తెలుగు సంఘాలతో సమన్వయం, తెలంగాణలో పెట్టుబడులు, పర్యాటక అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవాసులతో ప్రభుత్వ అనుసంధానం వంటి అంశాలపై కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. ప్రవాస తెలుగువారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జూపల్లి తెలిపారు. ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

# జోగినిలు కన్నీరు పెడితే తెలంగాణకు అరిష్టం

- బోనాల ఏర్పాట్లపై జోగిని శ్యామల ఆగ్రహం
- తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ప్రభుత్వంపై విమర్శలు
- ఐదు పాస్‌లకే పరిమితం చేశారని ఆరోపణ
- జోగినిలకు ఆలయ బోర్డుల్లో అవకాశం ఇవ్వాలని డిమాండ్

**సికింద్రాబాద్, ఆగస్టు 2**



బోనాల ఉత్సవాల్లో జోగినిలకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కన్నీరు పెడితే తెలంగాణ రాష్ట్రానికి మంచిది కాదని, అరిష్టం జరుగుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా ఆదివారం ఆలయానికి వచ్చిన ఆమె ప్రభుత్వ ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయని, తమలో ఊపిరి ఉన్నంత వరకు అమ్మవారి సేవకే అంకితం అవుతామని జోగిని శ్యామల అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాధారణ భక్తులతో పాటు జోగినిలకు కొంత ప్రాధాన్యం లభించేదని, ప్రస్తుత ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో వేలాది మంది శివశక్తులు ఉన్నప్పటికీ తమకు కేవలం ఐదు పాస్‌లు మాత్రమే ఇస్తామని చెప్పారని ఆమె పేర్కొన్నారు. ఆ ఐదుగురిలో ప్రముఖులకు భద్రత కల్పించాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆలయానికి వచ్చే సమయంలో భక్తుల రద్దీ మధ్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు.

బోనాల నిర్వహణకు ముందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశానికి తాము హాజరై సహకరించామని, కానీ ఆ తర్వాత భద్రత, పాస్‌ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని జోగిని శ్యామల అన్నారు. జోగినిల్లో చదువుకున్న వారు ఉన్నారని, ఆలయ పాలక మండళ్లలో తమకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

బోనాల పండుగను కేవలం రాజకీయ నాయకులు, పోలీసులు మాత్రమే నిర్వహిస్తున్నట్లు ఉందని ఆమె వ్యాఖ్యానించారు. మహంకాళి అమ్మవారి అసలు బోనాల వైభవం జోగినిలు బోనం ఎత్తినప్పుడే సంపూర్ణమవుతుందని అన్నారు. తమ సంప్రదాయాలకు గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# హైడ్రాకు ప్రజా మద్దతు వెల్లువ

**హైదరాబాద్, ఆగస్టు 2**

హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాకు ప్రజల నుంచి మద్దతు పెరుగుతోంది. హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ, ప్రభుత్వ నిర్ణయానికి సంఘీభావంగా నగరంలోని పలు కాలనీ సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేసిన ప్రజలు, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు మద్దతు ప్రకటించారు. అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్, వెంగల్‌రావునగర్ ప్రాంతాలకు చెందిన పలు కాలనీ సంక్షేమ సంఘాలు ర్యాలీల్లో పాల్గొన్నాయి. హైడ్రా చర్యలను వ్యతిరేకిస్తూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ ప్రభుత్వానికి మద్దతు తెలిపాయి. హైడ్రా ఏర్పాటైన తర్వాత గత రెండేళ్లలో చేపట్టిన చర్యలు నగర ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయని సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. సుమారు 3,325 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడటంతో పాటు, రూ.1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు తెలిపారు. రెండు విడతల్లో 20 చెరువుల పునరుద్ధరణ చేపట్టి వరద ముప్పును తగ్గించే చర్యలు తీసుకుందని ప్రశంసించారు. అమీర్‌పేట, పరిసర ప్రాంతాల్లో గతంలో స్వల్ప వర్షాలకే నీరు నిలిచిపోయేదని, హైడ్రా రంగంలోకి దిగిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చిందని స్థానికులు తెలిపారు. జీహెచ్ఎంసీ, జలమండలి, నీటిపారుదల శాఖల సమన్వయంతో వరద సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఆక్రమణదారులు, వారికి అండగా నిలిచే కొందరు వ్యక్తులే హైడ్రాపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని కాలనీ సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. నగర ప్రయోజనాల దృష్ట్యా హైడ్రా కొనసాగాల్సిందేనని, ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే చర్యలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కొనసాగించాలా లేదా అన్న అంశంపై ఇటీవల చర్చలు జరుగుతున్న నేపథ్యంలో కాలనీ సంఘాల ర్యాలీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 6,307 మంది చిన్నారులకు విముక్తి

**హైదరాబాద్, ఆగస్టు 2:**

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో 124 ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించి 6,307 మంది బాల కార్మికులు, వీధి బాలలను రక్షించాయి. ఈ ఆపరేషన్‌లో సుమారు 620 మంది పోలీసు సిబ్బంది పాల్గొని హోటళ్లు, దాబాలు, నిర్మాణ ప్రదేశాలు, ఇటుక బట్టీలు, వర్క్‌షాప్‌లు, వ్యాపార సంస్థల్లో రాత్రింబవళ్లు తనిఖీలు చేపట్టారు. రక్షించబడిన చిన్నారుల్లో 5,892 మంది బాలురు, 415 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 3,447 మంది తెలంగాణకు చెందినవారు కాగా, 2,860 మంది ఇతర రాష్ట్రాలు, నేపాల్‌కు చెందినవారిగా గుర్తించారు.

**బాల కార్మికులపై ఉక్కుపాదం**

రక్షించిన చిన్నారుల్లో 5,041 మంది బాల కార్మికులుగా పనిచేస్తుండగా, 647 మంది వీధి బాలలుగా, మరో 43 మంది భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసుల్లో బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టిన పోలీసులు మొత్తం 1,705 కేసులు నమోదు చేసి, 1,710 మందిని అరెస్టు చేశారు. కార్మిక శాఖ అధికారులు 1,381 తనిఖీ నివేదికలు జారీ చేయడంతో పాటు కనీస వేతనాల చట్టం కింద నిందితులకు రూ.37.95 లక్షల జరిమానా విధించారు.

**కుటుంబాలకు అప్పగింత..**

**అనాథలకు సంరక్షణ**

రక్షించిన చిన్నారుల్లో 5,737 మందిని అధికారులు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. కుటుంబ ఆధారం లేని లేదా అనాథలైన 570 మంది చిన్నారులను చైల్డ్ కేర్ సంస్థలకు తరలించి సంరక్షణ, పునరావాసం కల్పించారు. చిన్నారుల హక్కులను పరిరక్షిస్తూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తెలంగాణ పోలీసులు చేపట్టిన ఈ చర్యలను పలువురు అభినందిస్తున్నారు.

# కాళేశ్వరం బ్యారేజీల కింద సాంకేతిక లోపాలు?

**మొదటిపేజీ తరువాయి**

విద్యుత్తు పరిశోధనా సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) తెలంగాణ నీటిపారుదల శాఖకు సమగ్ర నివేదిక సమర్పించింది. జీపీఆర్ పరీక్షల ద్వారా బ్యారేజీల కింద సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భ నిర్మాణం, సీపేజీ మార్గాలు, రాతి పొరల పరిస్థితిని పరిశీలించారు. మొత్తం 225 వెంట్లలో 217 వెంట్ల వద్ద క్షేత్రస్థాయి అధ్యయనం నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాలు (కేవిటీస్), భారీ బండరాళ్లు, దెబ్బతిన్న రాతి పొరలు, పూడిక పేరుకుపోవడం వంటి అంశాలు నమోదైనట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌కు చెందిన 17 నుంచి 21 వరకు వెంట్లు, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్ వద్ద తీవ్ర స్థాయి అసాధారణతలు గుర్తించినట్లు వెల్లడైంది. అన్నారం బ్యారేజీలో 5వ బ్లాక్‌లోని 47వ వెంట్, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, 53వ వెంట్ల పరిసరాల్లో కూడా భూగర్భ పరిస్థితుల్లో మార్పులు గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. మూడు బ్యారేజీల్లో కలిపి కేవలం 11 వెంట్ల కింద మాత్రమే ఎలాంటి అసాధారణ పరిస్థితులు కనిపించలేదని, మిగతా ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో భూగర్భ మార్పులు ఉన్నట్లు అధ్యయనంలో వెల్లడైనట్లు సమాచారం. మేడిగడ్డ వద్ద వేగవంతమైన నీటి ప్రవాహం కారణంగా ఇసుక కొట్టుకుపోయి రాఫ్ట్ దిగువన ఖాళీలు ఏర్పడిన అవకాశాన్ని కూడా పరిశీలకులు ప్రస్తావించారు.

అయితే జీపీఆర్ పరీక్షలు భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే ఉపయోగపడతాయని, నిర్మాణ లోపాలను నేరుగా నిర్ధారించవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది. మరమ్మతులు లేదా పునరుద్ధరణ చర్యలకు ముందు బోర్‌హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ (ఈఆర్‌టీఏ) వంటి అదనపు ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించింది. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు సమగ్ర భూగర్భ అన్వేషణ జరగకపోవడం వల్లే ఇటువంటి అంశాలు ముందుగానే గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం లేదా నీటిపారుదల శాఖ అధికారికంగా స్పందిస్తే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం

**న్యూఢిల్లీ, ఆగస్టు 2**

రాష్ట్రాల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పన్నుల వాటాలో భాగంగా మొత్తం ₹1,09,019 కోట్లను అడ్వాన్స్ రూపంలో రాష్ట్రాలకు విడుదల చేసింది. సాధారణంగా ప్రతి నెల 10వ తేదీన విడుదలయ్యే నిధులను ఈసారి ముందుగానే జమ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వాలకు తక్షణ ఆర్థిక వెసులుబాటు లభించనుంది. అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. మూలధన వ్యయాన్ని పెంచడం, రాష్ట్రాల నగదు ప్రవాహాన్ని మెరుగుపరచడం కూడా ఈ ముందస్తు నిధుల విడుదల ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా ₹19,208 కోట్లు కేటాయించగా, బీహార్‌కు ₹10,845 కోట్లు విడుదలయ్యాయి. పెద్ద జనాభా, అభివృద్ధి అవసరాల నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాలకు అత్యధిక వాటా దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ₹4,597 కోట్లు, తెలంగాణకు ₹2,370 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు రాష్ట్రాల్లో అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల పనులకు ఉపయోగపడనున్నాయి. సంక్షేమ పథకాలు, వేతనాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరుగుతున్న సమయంలో కేంద్రం ముందుగానే నిధులు విడుదల చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో రాష్ట్రాలపై తక్షణ ఆర్థిక ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రాజెక్టుల అమలు మరింత వేగవంతం కానుందని భావిస్తున్నారు. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ముందస్తు నిధుల విడుదలతో రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా ముందుకు సాగేందుకు అవకాశం లభిస్తుంది. ఆర్థిక సంవత్సరం మధ్యలో ఇంత పెద్ద మొత్తంలో అడ్వాన్స్ విడుదల చేయడం రాష్ట్రాలకు గణనీయమైన ఊరటగా మారిందని వారు అభిప్రాయపడుతున్నారు.



# బారాముల్లాలో ఉగ్ర అనుమానితుడి అరెస్టు

- కశ్మీర్‌లో భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్
- షేరీ సెక్టార్‌లో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న బలగాలు
- ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- కుల్గాంలో వలస కార్మికుల హత్య కేసులో ముమ్మర గాలింపు
- భద్రతా పరిస్థితులపై ఎల్‌జీ మనోజ్ సిన్హా సమీక్ష

శ్రీనగర్, ఆగస్టు 2

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలపై భద్రతా దళాల చర్యలు కొనసాగుతున్నాయి. బారాముల్లా జిల్లాలోని షేరీ సెక్టార్ పరిధిలో సంయుక్త ఆపరేషన్ నిర్వహించిన భద్రతా బలగాలు ఓ ఉగ్ర అనుమానితుడిని అరెస్టు చేశాయి. అతని వద్ద నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఫతాగఢ్ ప్రాంతంలో అనుమానాస్పద కదలికలపై సమాచారం అందడంతో భారత సైన్యానికి చెందిన 46వ రాష్ట్రీయ రైఫిల్స్, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ 53వ బెటాలియన్ సంయుక్తంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నాయి. అయితే అతని గుర్తింపు, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు.

అరెస్టు చేసిన వ్యక్తికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయా, గతంలో ఏవైనా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్నాడా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఆయుధాలు ఎక్కడి నుంచి వచ్చాయి, అతనికి సహకరించిన వ్యక్తులు ఎవరనే అంశాలపై కూడా దర్యాప్తు సాగుతోంది.

మరోవైపు కుల్గాం జిల్లాలో ఇద్దరు వలస కార్మికుల హత్య ఘటన తర్వాత భద్రతా బలగాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనకు బాధ్యులైన ఉగ్రవాదులను గుర్తించేందుకు పలు ప్రాంతాల్లో సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని అధికార నేషనల్ కాన్ఫరెన్స్, ప్రతిపక్ష పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ డిమాండ్ చేశాయి.

పరిస్థితిని సమీక్షించిన జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై ఉగ్రవాద వ్యతిరేక చర్యలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న వలస కార్మికుల భద్రతకు అమలులో ఉన్న విధివిధానాలను సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. డీజీపీ నలిన్ ప్రభాత్‌తో పాటు ఇతర భద్రతా సంస్థల ఉన్నతాధికారులు సంఘటనా ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించడం, ఆయుధాల సరఫరా మార్గాలను అడ్డుకోవడం, సాధారణ ప్రజలు మరియు వలస కార్మికుల భద్రతను మరింత బలోపేతం చేయడంపై భద్రతా దళాలు ప్రత్యేక దృష్టి సారించాయి.

# డ్రగ్స్ రహిత యువతతోనే వికసిత్ భారత్

- ‘నశా ముక్త్ యువ’ జాతీయ ప్రచారానికి శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ
- దేశవ్యాప్తంగా 100 వారాల పాటు అవగాహన కార్యక్రమాలు
- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రధాని పిలుపు
- 10 వేలకుపైగా ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం



న్యూఢిల్లీ, ఆగస్టు 2

డ్రగ్స్ రహిత యువతే అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి బలమైన పునాది అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యువతను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి దూరంగా ఉంచి, సామాజిక మార్పుకు భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ‘నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్’ కార్యక్రమాన్ని శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 100 వారాల పాటు ఈ ప్రచారం కొనసాగనుంది. ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం కేవలం వ్యక్తుల కోసమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తు కోసం చేపట్టిన ప్రజా ఉద్యమమని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన యువత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్ వంటి ప్రమాదకర అలవాట్లకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని గత ఏడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని, ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించిందని ప్రధాని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో 125కు పైగా ఆధ్యాత్మిక సంస్థలు, సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములవడం సంతోషకరమని చెప్పారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటం ఒక్కరి వల్ల సాధ్యం కాదని, ప్రజలందరూ కలిసికట్టుగా ముందుకొస్తేనే విజయవంతమవుతుందని మోదీ అన్నారు. ఇప్పటికే లక్షలాది మంది యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారని, తమ పాఠశాలలు, కళాశాలలు, సమాజాల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు వస్తున్నారని వెల్లడించారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా పోటీలు, వాక్‌థాన్‌లు, ధ్యాన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, నాటకాలు, చర్చా వేదికలు, చిత్రలేఖన పోటీలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం కల్పించనున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన పౌరులతోనే అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించవచ్చని అన్నారు. 2020లో డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యాన్ని ప్రధాని ప్రకటించారని గుర్తుచేస్తూ, తాజా ప్రచారం ఆ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. దేశవ్యాప్తంగా 10 వేలకుపైగా ప్రాంతాల్లో విద్యాసంస్థలు, యువజన సంఘాలు, సివిల్ సొసైటీ సంస్థలు, పరిశ్రమల సంఘాలు, ఆధ్యాత్మిక సంస్థలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, మై భారత్ వాలంటీర్లు, యువజన క్లబ్బులు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ ఉద్యమంలో భాగస్వాములవుతున్నాయి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతే మార్పుకు రాయబారులుగా నిలవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. 100 వారాల పాటు కొనసాగే ఈ జాతీయ ప్రచారం ద్వారా డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# జంతర్‌మంతర్ నిరసనల్లో అల్లర్ల కుట్ర?

- పాక్ ఉగ్ర నెట్‌వర్క్‌తో యువజంటకు సంబంధాల ఆరోపణలు
- పశ్చిమ బెంగాల్ ఎస్టీఎఫ్ దర్యాప్తులో సంచలన అంశాలు
- జంతర్‌మంతర్ నిరసనల్లో గందరగోళం సృష్టించాలని పాక్ హ్యాండ్లర్ల ఆదేశాల ఆరోపణ
- హనీట్రాప్ ముఠా నిర్వహణపై దర్యాప్తు
- ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్ నుంచి ఆదేశాల మార్పిడి





కోల్‌కతా, ఆగస్టు 2

పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) చేపట్టిన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. బర్ధమాన్‌లో హమీమ్ మొండల్‌ను, అనంతరం జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌లో అతని స్నేహితురాలు అర్పితా సర్కార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో పాకిస్థాన్ హ్యాండ్లర్ల సూచనల మేరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో అల్లర్లు, గందరగోళం సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తు ప్రకారం, ఈ కార్యకలాపాల కోసం పోలీసు యూనిఫారాలు కొనుగోలు చేసి మహిళలు, పురుషులతో కూడిన బృందంతో ఢిల్లీకి వెళ్లాలని హమీమ్‌కు సూచనలు అందినట్లు అధికారులు పేర్కొన్నారు. గత నాలుగు నుంచి ఐదు నెలలుగా అతను పాక్ ఆధారిత నెట్‌వర్క్ ప్రభావంలోకి వెళ్లినట్లు గుర్తించినట్లు తెలిపారు.

హమీమ్ బాధ్యతల్లో రాజకీయ నాయకులు, వీఐపీలు, పోలీసు అధికారుల వివరాలు సేకరించడం, కొత్త వ్యక్తులను నెట్‌వర్క్‌లోకి చేర్చడం కూడా ఉన్నట్లు ఎస్టీఎఫ్ వెల్లడించింది. నాలుగేళ్లుగా పరిచయమున్న అర్పితా సర్కార్‌ను కూడా ఈ కార్యకలాపాల్లో భాగస్వామిని చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభావశీల వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్ ముఠాను నిర్వహించినట్లు, అర్పితా ద్వారా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ సీనియర్ మంత్రి కుమారుడిని కూడా హనీట్రాప్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు.

వీరిద్దరూ వాట్సాప్, టెలిగ్రామ్, ఎలిమెంట్ ఎక్స్, సెషన్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో అబీర్ జాట్ 333, ఉజైర్, రాణా, హమద్ అనే నలుగురు కీలక హ్యాండ్లర్లను గుర్తించినట్లు ఎస్టీఎఫ్ ఐజీ గౌరవ్ శర్మ వెల్లడించారు. వీరు బ్రిటన్, మెక్సికో సిమ్ కార్డులను ఉపయోగిస్తూ యువతను తీవ్రవాద భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు ఆరోపించారు.

అర్పితా సర్కార్‌ను కోర్టు 13 రోజుల ఎస్టీఎఫ్ కస్టడీకి అప్పగించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలున్న మరికొందరిపై కూడా విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఆరోపణలకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది.

# ఢిల్లీలో ఎంపీ పప్పు యాదవ్‌పై దాడి యత్నం

- ప్రెస్‌మీట్‌లో షూ విసిరి.. కత్తితో దాడికి ప్రయత్నం
- అధికారిక నివాసంలో జరిగిన ఘటనతో కలకలం
- అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, అనుచరులు దుండగులను పట్టివేత
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- తన హత్యకు కుట్ర జరుగుతోందని ఎంపీ ఆరోపణ



న్యూఢిల్లీ, ఆగస్టు 2

బీహార్‌లోని పూర్ణియా లోక్‌సభ నియోజకవర్గ స్వతంత్ర ఎంపీ రాజేష్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్‌పై ఢిల్లీలో దాడి యత్నం చోటుచేసుకుంది. ఆయన అధికారిక నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరగడంతో రాజకీయ వర్గాల్లో కలకలం రేగింది.

సమావేశం కొనసాగుతుండగా ఓ వ్యక్తి ఒక్కసారిగా పప్పు యాదవ్ వైపు షూ విసిరాడు. అదే సమయంలో అక్కడే ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే భద్రతా సిబ్బంది, అనుచరులు వెంటనే అప్రమత్తమై వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

సమాచారం అందుకున్న ఢిల్లీ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరిని ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షెహర్‌కు చెందిన సుమిత్‌గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఘటనకు గల కారణాలు, దాడి వెనుక ఉన్న నేపథ్యంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఘటన అనంతరం స్పందించిన పప్పు యాదవ్ తనను హత్య చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇలాంటి దాడులకు తాను భయపడబోనని, ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "నన్ను చంపాలని ఎవరైనా భావిస్తే చంపనివ్వండి. కానీ ప్రజల కోసం నా పోరాటం ఆగదు" అని వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సహా పలువురు గ్యాంగ్‌స్టర్ల నుంచి తనకు ప్రాణహాని హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో, అధికారిక నివాసంలోనే ఈ దాడి యత్నం జరగడం భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఘటనపై ఢిల్లీ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సీజేపీ నిధులపై విచారణ కోరిన ఆర్టీఐ కార్యకర్త

- రూ.1 కోట్ల లీగల్ డిఫెన్స్ ఫండ్‌పై అధికారులకు ఫిర్యాదు
- ఎన్నికల సంఘం, కేంద్ర జీఎస్టీ అధికారులకు లేఖ
- సంస్థ చట్టబద్ధ హోదాపై విచారణ చేయాలని డిమాండ్
- వ్యవస్థాపకుడి కుటుంబ ఆర్థిక వ్యవహారాలపైనా ప్రశ్నలు
- రూ.1 కోటి విరాళం ప్రకటించిన కపిల్ సిబల్



న్యూఢిల్లీ, ఆగస్టు 2

సీజేపీ (సీజేపీ) ఏర్పాటు చేసిన లీగల్ డిఫెన్స్ ఫండ్‌కు సంబంధించి ప్రకటించిన రూ.1 కోట్ల విరాళం నేపథ్యంలో ఆ సంస్థ కార్యకలాపాలపై విచారణ చేపట్టాలని సూరత్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం, కేంద్ర జీఎస్టీ అధికారులకు ఆయన లేఖలు పంపినట్లు తెలిపారు. సీజేపీ రాజకీయ పార్టీగా నమోదు కాకపోయినా రాజకీయ పార్టీ తరహాలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని అమిత్ తివారీ ఆరోపించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29ఏ ప్రకారం సంస్థ నమోదు అయిందా లేదా అనే అంశాన్ని ఎన్నికల సంఘం పరిశీలించాలని కోరారు. నమోదు లేకపోతే రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడం, ప్రజల నుంచి నిధులు సేకరించడం వంటి అంశాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కుటుంబ ఆర్థిక వ్యవహారాలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. మహారాష్ట్ర ప్రభుత్వంలో విశ్రాంత ఉద్యోగిగా పనిచేసిన అభిజిత్ దీప్కే తండ్రి భగవాన్‌రావు దీప్కే ఆర్థిక పరిస్థితిని పరిశీలించాలని, అలాగే అభిజిత్ దీప్కే విదేశాల్లో ఉన్నత విద్య కోసం అవసరమైన నిధులు ఎలా సమకూరాయో కూడా సంబంధిత సంస్థలు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రూ.1 కోట్ల లీగల్ డిఫెన్స్ ఫండ్‌పై 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందా లేదా అనే అంశాన్ని కూడా కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు పరిశీలించాలని తివారీ కోరారు. నిధుల స్వీకరణ, వినియోగం ప్రస్తుత పన్ను నిబంధనలకు అనుగుణంగా జరిగిందా అనే విషయంపై స్పష్టత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ సీజేపీ ఏర్పాటు చేసిన లీగల్ డిఫెన్స్ ఫండ్‌కు రూ.1 కోటి విరాళం అందజేస్తున్నట్లు ప్రకటించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసుకు సంబంధించిన నిరసనల సందర్భంగా నమోదైన కేసుల్లో చిక్కుకున్న వారికి న్యాయ సహాయం అందించేందుకు ఈ నిధిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అయితే అమిత్ తివారీ చేసిన ఆరోపణలు ప్రస్తుతం ఆరోపణల స్థాయిలోనే ఉన్నాయి. వాటిపై సంబంధిత అధికార సంస్థలు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం సీజేపీ చట్టపరమైన హోదా, నిధుల సేకరణ విధానం, పన్ను నిబంధనల అమలు వంటి అంశాలపై అధికారిక స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.



# రాజకీయాల్లోకి సీజేపీ అడుగు?

- ఆగస్టు 5న భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయం
- ఉద్యమ సంస్థగా కొనసాగాలా.. రాజకీయ పార్టీగా మారాలా?
- కోర్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయం
- యువత మద్దతుతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థ

న్యూఢిల్లీ, ఆగస్టు 2

ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సీజేపీ) రాజకీయ రంగ ప్రవేశంపై కీలక నిర్ణయం తీసుకోనుంది. ఉద్యమ సంస్థగా కొనసాగాలా? లేక రాజకీయ పార్టీగా మారాలా? అనే అంశంపై ఆగస్టు 5న నిర్వహించే కోర్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. సమావేశం తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడిస్తారని పార్టీ ప్రతినిధులు తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ ఉద్యమం తర్వాత అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో సీజేపీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. అయితే సీజేపీని కేవలం విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే ఉద్యమ వేదికగానే కొనసాగిస్తామని అభిజీత్ దీప్కే గతంలో స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య, శాంతియుత మార్గాల్లోనే పోరాటాలు కొనసాగిస్తామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఇతర పార్టీల్లో విలీనం కాబోమని ప్రకటించారు. ప్రస్తుతం విద్యా రంగ సమస్యలు, యువత ఎదుర్కొంటున్న అంశాలపై ఉద్యమాలను కొనసాగిస్తూ ప్రభావవంతమైన శక్తిగా నిలవడమే సీజేపీ ముందున్న సవాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా ఆధారంగా వేగంగా విస్తరించడం, పెద్ద సంఖ్యలో యువతను ఆకర్షించడం వంటి అంశాలు ఈ సంస్థకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని పేర్కొంటున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక ఇతర శక్తుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఉన్నప్పటికీ, సమాజంలో ఉన్న అసంతృప్తి, సమస్యలే ఇలాంటి ఉద్యమాలకు కారణమవుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆగస్టు 5 సమావేశంలో తీసుకునే నిర్ణయం సీజేపీ భవిష్యత్ దిశను నిర్ణయించనుంది.





# ఉజ్జయిని మహంకాలమ్మను దర్శించుకున్న కేటీఆర్

## కేటీఆర్, పద్మారావు లకు లస్కర్ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన పండాల శివ కుమార్ గౌడ్

**సికింద్రాబాద్,ఆగస్టు 2, రాజముద్ర న్యూస్:**

ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాల వేడుకలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారి సుభిక్షతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని,రైతులకు సమృద్ధిగా పంట రావాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్ శ్రీమహంకాళి అమ్మ బోనాల పండుగ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి కేటిఆర్ రావడంతో చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు పండాల శివ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు పద్మారావు కుమారులు రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్ స్వాగతం పలికి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో కేటిఆర్ విందు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాగారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు గూడూరు మహేష్ గౌడ్,జనగామ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, లింగాల భరత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# స్నేహం.. దేవుడిచ్చిన వరం నేడు వ్యాపారమైందా

**ఖమ్మం రాజముద్ర న్యూస్**

"ఒక ప్రాణం మరో ప్రాణానికి ఇచ్చే అతి గొప్ప బహుమతి స్నేహం" అన్నారు. కానీ నేడు అదే స్నేహం కాటేస్తున్న స్నేహంగా, మోసం చేసే స్నేహంగా మారిపోయింది. స్నేహ సంబంధాలతో బతుకులు ఆగమవుతున్నాయి. గత కాలం స్నేహం వేరు, ఇప్పటి స్నేహం వేరు.

గత కాలపు స్నేహం – నిస్వార్థ బంధం

పాత రోజుల్లో స్నేహం అంటే "ప్రాణం ఇవ్వటం" కృష్ణుడు–కుచేలుడు, కర్ణుడు–దుర్యోధనుడు లాంటి ఉదాహరణలు మన పురాణాల్లో ఉన్నాయి.

ఒకరి కష్టం ఒకరు పంచుకునేవారు. డబ్బు లేకపోయినా మనసులు ఉండేవి.

స్నేహితుడి ఇల్లు తన ఇల్లులా, స్నేహితుడి కుటుంబం తన కుటుంబంలా ఉండేది.

అక్కడ లెక్కలు లేవు, స్వార్థం లేదు, అవసరం అయిపోయాక వదిలేసే తత్వం లేదు.నేటి కాలపు స్నేహం – అవసరపు బంధం నేడు స్నేహం అంటే "మోసం చేయటం" నేర్చుకున్నాం.ఎందుకు మారింది?

స్వార్థం: ఉద్యోగం, బిజినెస్, పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్, డబ్బు ఉన్నంత వరకే స్నేహం. అవసరం తీరగానే "నంబర్ బ్లాక్".

సోషల్ మీడియా స్నేహాలు: ఎఫ్ బి లో 5000 ఫ్రెండ్స్, ఇనిస్టా లో 10కె ఫాలోవర్స్. కానీ ఆసుపత్రిలో అడ్మిట్ అయితే పలకరించే వాడు ఒక్కడు ఉండడు. లైక్ ల కోసం స్నేహం.అప్పు–మోసం: "ఫ్రెండ్ కదా" అని లక్షలు అప్పు



ఇస్తే, తిరిగి అడిగితేనే శత్రువుగా మారుతున్నాడు.స్నేహం పేరుతో నేరాలు: ప్రాణ స్నేహితులే ఆస్తి కోసం, అమ్మాయి కోసం, చిన్న ఈగో కోసం ఒకరినొకరు చంపుకుంటున్న ఘటనలు రోజూ చూస్తున్నాం. స్నేహం పేరుతో జరుగుతున్న 3 పెద్ద ద్రోహాలు

స్నేహం పేరుతో మర్డర్లు: నమ్మకాన్ని ఆయుధంగా చేసి వెన్నుపోటు పొడుస్తున్నారు.

స్నేహం పేరుతో మోసాలు: బిజినెస్ పార్టనర్ షిప్, ఉద్యోగం, విదేశీ అవకాశం అని నమ్మించి మోసం.

స్నేహం పేరుతో అప్పులు: "ఒక నెలలో ఇస్తా" అని తీసుకుని, సంవత్సరాలు గడిచినా తిరిగి ఇవ్వరు. అడిగితే గొడవ.

ఇలా ఏ రకంగా చూసినా ఇప్పటి స్నేహాలు చాలా దుర్మార్గంగా, ప్రమాదకరంగా మారాయి. స్నేహం ఎందుకు విలువైనది?

స్నేహం లేని జీవితం ఎడారి లాంటిది. కష్టంలో ధైర్యం ఇచ్చేది, సంతోషంలో రెట్టింపు చేసేది, తప్పు చేస్తే మందలించేది స్నేహమే. డబ్బు కొనలేని, పదవి ఇవ్వలేని బలం స్నేహానికి ఉంది. పరిష్కారం – నిజమైన స్నేహాన్ని ఎలా గుర్తించాలి?

అవసరంలో పరీక్ష: నువ్వు ఏమీ ఇవ్వలేని టైం లో కూడా నీతో ఉండేవాడే నిజమైన స్నేహితుడు.లెక్కలు చూడడు: ఇచ్చింది, పుచ్చుకున్నది లెక్కపెట్టడు.వెన్నుపోటు పొడవడు: నీ గురించి నీ వెనుక గొప్పగా మాట్లాడేవాడే నిజమైనవాడు.

క్వాలిటీ > క్వాంటిటీ: 100 మంది ఫేక్ ఫ్రెండ్స్ కంటే ఒకే ఒక నిజమైన స్నేహితుడు చాలు.స్నేహం అనేది బంధం, వ్యాపారం కాదు. నమ్మకం, నిస్వార్థం దాని పునాదులు. ఈ రోజు మనం నాటే ప్రతి స్నేహ బీజం, రేపు మనకు నీడ ఇస్తుంది. కానీ కాటేసే స్నేహాలను నమ్మితే మన బతుకే ఆగమమవుతుంది. "స్నేహం అంటే కలిసి నవ్వడం కాదు... కన్నీరు వచ్చినప్పుడు తుడిచే చేయి"

# ప్రజా పోరాటాలకు యువత సిద్ధం కావాలి

- ఈ నెల 10న "జైలు భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, డివిజన్ అధ్యక్షురాలు భూక్య వనజ రాథోడ్

**ఖమ్మం రాజముద్ర న్యూస్**




ప్రజా సమస్యలపై జరుగుతున్న పోరాటాలకు యువత ముందుండి నడిపించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు పిలుపునిచ్చారు. ఆదివారం నేలకొండపల్లిలోని రావెళ్ల సత్యనారాయణ భవనంలో డివైఎఫ్ఐ మండల కమిటీ సమావేశం సంఘం మండల కార్యదర్శి లోడుగు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బొడ్డు మధు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు కేవీరెడ్డి, డివైఎఫ్ఐ డివిజన్ అధ్యక్షురాలు భూక్య వనజ రాథోడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా బొడ్డు మధు మాట్లాడుతూ, న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కార్మికులు, రైతులు, యువజనులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నా దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఆ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని జిల్లా వ్యాప్తంగా యువత ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, విద్యా–ఉపాధి అవకాశాల కొరత, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ★ వంటి సమస్యలపై యువత పోరాడాలన్నారు. యువత భవిష్యత్తును కాపాడుకోవాలంటే ప్రజా సమస్యలపై జరుగుతున్న పోరాటాల్లో చురుకుగా పాల్గొనాలని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, ఉద్యోగాల భర్తీ, విద్యా హక్కు, సామాజిక న్యాయం సాధన కోసం జరిగే ఉద్యమాల్లో యువత అగ్ర భాగాన నిలవాలని అన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు కేవీరెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా వినిపించిన ప్రజల గొంతుకను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆలకించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.డివైఎఫ్ఐ డివిజన్ అధ్యక్షురాలు భూక్య వనజ రాథోడ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారానే ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రజలకు న్యాయం సాధించవచ్చన్నారు. యువత సామాజిక బాధ్యతతో ప్రజా పోరాటాలలో విస్తృతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, యువత భవిష్యత్తు, ప్రజా సంక్షేమం కోసం ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న "జైలు భరో" కార్యక్రమంలో యువత, మహిళలు, వ్యవసాయ కార్మికులు, అన్ని రంగాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు బొడ్డు సెలవ రాజ్, మండల కమిటీ సభ్యులు దేగల హరిప్రసాద్, టి ప్రవీణ్, పి నవీన్, కళ్యాణ్, భార్గవ్, వంశి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగి వేణుగోపాల్ ఆత్మహత్య యత్నం

## రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క స్పందించాలి

**ఖమ్మం రాజముద్ర న్యూస్ :**



ముదిగొండ మండలం న్యూ లక్ష్మి పురం గ్రామానికి చెందిన నిరుద్యోగి వేణుగోపాల్ ఆత్మహత్య యత్నం చేయడం అత్యంత బాధాకరమని బిజెవైఎం మాజీ జిల్లా అధ్యక్షులు, ముదిగొండ మండల ప్రభారి అనంతు ఉపేందర్ గౌడ్ అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్లే నిరుద్యోగ యువతలో తీవ్ర నిరాశ నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆత్మహత్య యత్నానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.వేణుగోపాల్ కుటుంబ సభ్యులకు ధైర్యం ఉండాలని, ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ఇవ్వాలని కోరారు.ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన అంశాలు వేణుగోపాల్ ఆత్మహత్య యత్నం పరిస్థితులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి. నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగాలపై నిరాశ వంటి కారణాలు ఉంటే, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి. ఎన్నికల్లో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ విడుదలపై ఆలస్యం చేయకుండా వెంటనే నిర్ణయాలు తీసుకోవాలి. యువత భవిష్యత్తు దృష్ట్యా ఉపాధి అవకాశాలు పెంచే చర్యలు చేపట్టాలి.రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఈ అంశంపై వెంటనే స్పందించి నిరుద్యోగులకు భరోసా కల్పించాలని అనంతు ఉపేందర్ గౌడ్ కోరారు.

# భూముల బదిలీలపై సమగ్ర విచారణ జరిపించాలి




- పొద్దటూరు గ్రామ దళిత రైతులు కలెక్టర్ యాక్షన్ టే కింగ్ రిపోర్టును తిరస్కరించాలి
- రూ.1.50 కోట్ల హామీతో పాటు, నష్ట పరిహారం ఇప్పించాలి

**శంకర్ పల్లి: రాజముద్ర న్యూస్:**

ఎస్సీ రైతుల సాగు హక్కులు, భూముల స్వాధీ నాన్ని రక్షించాలని రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం పొద్దటూరు గ్రామ దళిత రైతులు కోరారు. బుధవారం

పొద్దటూరు గ్రామానికి చెందిన దళితులు తమ భూ సమస్యపై మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. తమను మోసం చేశారని ఆరోపిస్తూ బలం రెడ్డి శ్రీనివాస్, వై వి విక్రాంత్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పన్నాలాల్ కు

సంబంధించిన 360 ఎకరాల భూమిపై సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రైతులు కోరారు. తాము జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ)లో ఫిర్యాదు చేసినప్పటికీ, పూర్తి స్థాయి విచారణ జరపకుండానే నివేదిక ఎలా సమర్పించారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. అలాగే దొంగచాటుగా ఓఆర్సీలు జారీ చేసిన అధికారులపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, త్వరలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ప్రాథమిక విద్య వ్యవస్థ బలోపేతానికి కృషి

## సెకండ్ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి




**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**

అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని సాయి చైతన్య హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తేనే ఉన్నత విద్య పటిష్టమై, విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు దుగ్గి గణేష్, ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.... ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు. రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి పాఠశాలలు మూతపడే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీఓ నంబర్ 25ను సవరించాలని డిమాండ్ చేశారు. 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించి, ఈ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని మహిపాల్‌రెడ్డి కోరారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ డీఏలు, పీఆర్సీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రామ్ శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మీరు హెల్దీగానే ఉన్నారా? ఇలా తెలుసుకోండి?





మనం అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నామా? లేదా? ఏదైనా సమస్య ఉందా? అన్న విషయం మనం కొన్ని అంశాల ఆధారంగా తెలుసుకోవచ్చు. మనకు తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మాత్రమే కొన్ని రకాల పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. అప్పుడే మనకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయం తెలుస్తూ ఉంటుంది. అయితే మన శరీరంలో జరిగే కొన్ని మార్పుల ఆధారంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

## జీర్ణవ్యవస్థ

మన ఆరోగ్యం విషయంలో జీర్ణ వ్యవస్థ ఎంతో కీలకం. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాలేదంటే మనకు ఏదో జీర్ణ సంబంధిత వ్యాధి ఉన్నట్టు పరిగణించాలి. తిన్న తర్వాత గ్యాస్ పట్టినట్టు అనిపిస్తుంటే కచ్చితంగా జీర్ణ వ్యవస్థలో ఏదో ఇబ్బంది ఉన్నట్టే గుర్తించాలి. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయితేనే మన శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



## తగినంత నిద్ర

మనకు సరిగ్గా నిద్ర పట్టడం లేదంటే.. మనం డేంజర్ లో ఉన్నట్టే.. కాబట్టి కచ్చితంగా ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతోపాటూ నిద్ర రాకపోయినా సమస్యగానే పరిగణించాలి. ఆరోగ్యంగా ఉన్నవారు మంచి నిద్రను పొందుతారు. రాత్రి నిద్ర తర్వాత రిఫ్రెష్, విశ్రాంతిని పొందుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరానికి మంచి నాణ్యమైన నిద్ర లభిస్తే.. అది మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి సంకేతంగా పరిగణించబడుతుంది.





## సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు

మూత్రవిసర్జన వలె, ప్రేగు కదలికలపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. సాధారణ, సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు మెరుగైన జీర్ణక్రియకు సంకేతంగా పరిగణించబడతాయి. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలను కలిగి ఉండటం సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మలం విసర్జించడంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, మలవిసర్జన తర్వాత ఖాళీగా అనిపిస్తే అది మంచి ఆరోగ్యానికి సంకేతం.

## మూత్రం రంగు

మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం మన మల, మూత్రాల రంగును చూస్తే అర్థమవుతుంది. ఉన్నామో లేదో తెలుసుకోవడానికి.. మలం, మూత్రంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. లేత పసుపు మూత్రం సాధారణంగా మీరు బాగా హైడ్రేట్ గా ఉన్నారని సూచిస్తుంది. ఇది కిడ్నీ రికవరీకి సంకేతంగా కూడా పరిగణించబడుతుంది. మూత్రం గట్టిపడటం లేదా రంగులో మార్పు కనిపిస్తే, జాగ్రత్తగా ఉండాలి.



## బరువును నియంత్రించడం:

అనేక రకాల వ్యాధులను నివారించడానికి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. మీ శరీర ఎత్తును బట్టి మీ బరువు సరిగ్గా ఉంటే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. మీ బరువు తక్కువ సమయంలో వేగంగా పెరుగుతూ లేదా తగ్గుతూ ఉంటే, జాగ్రత్తగా ఉండాలి. బరువు అసమతుల్యత అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది.





## మంచి మానసిక ఆరోగ్యం:

శారీరక ఆరోగ్యంలాగే, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీరు తక్కువ ఒత్తిడికి లోనవుతుంటే, మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చిరాకు, భయం వంటి సమస్యలు ఉండవు. అది మంచి మానసిక ఆరోగ్యానికి సంకేతం. శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఒకదానికొకటి సంపూర్ణంగా ఉంటాయని ఇక్కడ గమనించడం ముఖ్యం. వీటిలో ఏదైనా ఒకదానిలో ఆటంకం మొత్తం శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



## గాయాలను త్వరగా నయం చేయడం

శరీరంపై గాయం లేదా గాయం ఎంత త్వరగా నయం అవుతుందనే దాని ఆధారంగా కూడా ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. గాయాలు త్వరగా మానితే మన రోగనిరోధక వ్యవస్థ బాగానే ఉందనడానికి సంకేతం. మధుమేహం వంటి వ్యాధులలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది. వీటితో పాటు మనం తరుచూ అనారోగ్యానికి గురవుతున్నామంటే కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

# ఉలవలతో ఇన్ని లాభాలా?



ఉలవచారు, ఉలవచారు బిర్యాని ఇప్పుడు ఎంతో ఫేమస్. అయితే ఉలవలతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీటితో ఇప్పుడు రకరకాల వంటలు చేస్తున్నారు. భారత దేశంలోని ఉష్ణమండల వాతావరణాల్లో ఈ ఉలవలు పెరుగుతాయి. వీటిలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉలవలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎర్రటి, గోధుమ రంగు పప్పుధాన్యాలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని శతాబ్దాలుగా సాంప్రదాయ వైద్యంలో వివిధ రకాల రోగాలకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతున్నాయి.

## ప్రోటీన్ పుష్కలంగా..

ఉలవల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు, మరమ్మతుగా ప్రొటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. శాకాహారులకు ప్రొటీన్ అందజేసే ఆహారాల్లో ఉలవలు కూడా ఎంతో కీలకం. ఇక ఉలవల్లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో ఫైబర్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పోషకాలు అధికంగా ఉండే ఉలవల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నిర్వహణ, మొత్తం ఆరోగ్యానికి గొప్ప ఆహారంగా మారుతుంది. ఉలవల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్ఆనయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయని అధ్యయనాలు నిరూపించాయి.

## గుండె ఆరోగ్యం పదిలం

ఉలవలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దాని అధిక ఫైబర్ కంటెంట్, యాంటీఆక్సిడెంట్ లక్షణాల కారణంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉలువలలో ఉండే ఐరన్, మెగ్నీషియం, విటమిన్ సీ వంటి విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.





# కాకరతో ఇన్ని ప్రయోజనాలా? తెలిస్తే అస్సలు వదలరు..!

కాకరకాయ ఈ కూరగాయ పేరు చెప్పగానే చాలా మంది నిట్టూరుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కాకరను తప్పదన్నట్టు తింటుంటారు. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు కాకరకాయ ఓ సంజీవని లాంటిది. చక్కెర స్థాయిలను కాకర కంట్రోల్ చేస్తోంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది. జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది.

## కాకరరసంతో లాభాలు ఇవే..!

కాకరకాయ జ్యూస్ తరుచూ తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులకు దూరం కావొచ్చుట. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో కాకర కాయ రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుత కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు జీర్ణ సంబంధిత సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాకర కాయ రసాన్ని ఖాళీ కడుపుతో తాడగం వల్ల శరీరంలోని సమస్యలు తొలగిపోయి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

## బరువు నియంత్రణ:

పెరిగిన బరువుతో చాలా మంది ఆందోళన చెందుతున్నాయి. అలాంటి వారు కాకర కాయ రసం తాగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండే కాకర కాయ రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా కాకర రసం తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి ఎంతో సహాయపడుతుంది.

## ఇమ్యూనిటీ బూస్టర్.. !

ప్రస్తుత వర్షా కాలంలో జనం అనేక రోగాల బారిన పడుతున్నారు. సరైన ఇమ్యూనిటీ లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కాకర రసం తరుచూ తీసుకోవడం.. లేదంటే కాకరకాయలను కూర చేసుకొని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని వైద్య నిపుణలు సూచిస్తున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తినిపెంచుతాయి.

## చర్మానికి మేలు:

కాకర కాయ రసం చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కాకర కాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి . ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి కాంతివంతగా చేస్తాయి. కాకర కాయ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల చర్మానికి కొత్త మెరుపు వస్తుంది. అంతే కాకుండా దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

# రిటైర్ అయిన అజింక్య రహానేకు భారీ పెన్షన్.. బీసీసీఐ నుంచి నెలనెలా ఎంతొస్తుందంటే?

- అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానే
- బీసీసీఐ నుంచి నెలకు రూ.70,000 పెన్షన్ అందుకోనున్న రహానే
- గంగూలీ హయాంలో మాజీ క్రికెటర్ల పెన్షన్‌ను పెంచిన బీసీసీఐ
- ఆస్ట్రేలియాలో చారిత్రక సిరీస్ విజయం అందించిన కెప్టెన్
- బీసీసీఐ పదవులు చేపడితే పెన్షన్‌కు బ్రేక్ పడే అవకాశం

**స్పోర్ట్స్ డెస్క్ :**

టీమిండియా వెటరన్ బ్యాటర్ అజింక్య రహానే ఇటీవల తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. జులై 30న అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. 202021లో ఆస్ట్రేలియా గడ్డపై స్టాండ్‌ఇన్ కెప్టెన్‌గా చారిత్రక బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీని అందించిన రహానే, క్రీడలో అత్యంత గౌరవనీయమైన ఆటగాళ్లలో ఒకరిగా నిలిచాడు. ఆట నుంచి తప్పుకున్నప్పటికీ, బీసీసీఐ అతనికి ఆర్థికంగా అండగా నిలవనుంది.

నిబంధనల ప్రకారం రిటైర్ అయిన ఆటగాళ్లకు బీసీసీఐ పెన్షన్ అందిస్తుంది. 2022లో బీసీసీఐ మాజీ క్రికెటర్ల పెన్షన్ మొత్తాన్ని సవరించింది. గతంలో రహానే స్థాయి అనుభవం ఉన్న ఆటగాళ్లకు నెలకు రూ. 50,000 పింఛన్ లభించేది. అయితే, నాలుగేళ్ల క్రితం ఈ మొత్తాన్ని రూ. 70,000కు పెంచారు. రహానే భారత్ తరఫున 85 టెస్టులు ఆడినందున, అతడు ఈ టాప్ బ్రాకెట్‌లోకి వస్తాడు. దీంతో అతనికి ఇకపై ప్రతినెలా రూ. 70,000 పెన్షన్‌గా అందనుంది.

సౌరవ్ గంగూలీ బీసీసీఐ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ పెన్షన్ పెంపు నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో గంగూలీ మాట్లాడుతూ, "మాజీ క్రికెటర్ల ఆర్థిక బాగోగులు చూసుకోవడం చాలా ముఖ్యం. ఆటగాళ్లే మనకు జీవనాధారం. వారి ఆట ముగిశాక వారికి అండగా నిలవడం బోర్డుగా మా విధి. అంపైర్లు కూడా తెరవెనుక హీరోలు, వారి సహకారాన్ని బీసీసీఐ ఎంతో గౌరవిస్తుంది" అని తెలిపాడు.

భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడిన రహానే, తన తదుపరి ప్రణాళికలు ఏమిటనేది ఇంకా స్పష్టం చేయలేదు. అయితే, భవిష్యత్తు తరాలకు మెంటార్‌గా వ్యవహరించాలనే ఆసక్తిని కనబరిచాడు. అయితే, ఈ పెన్షన్ పొందడానికి ఒక ముఖ్యమైన నిబంధన ఉంది. భవిష్యత్తులో రహానే బీసీసీఐలో కోచ్‌గా లేదా ఇతర అధికారిక పదవి చేపడితే, ఆ పదవిలో ఉన్నంత కాలం ఈ పెన్షన్ నిలిపివేయబడుతుంది. ఆ పదవి నుంచి తప్పుకున్న తర్వాతే పెన్షన్ పునఃప్రారంభమవుతుంది.



# కామన్వెల్త్ గేమ్స్‌లో భారత పతకాల ప్రభంజనం.. బాక్సింగ్‌లో 7 స్వర్ణాలు, అథ్లెటిక్స్‌లో గుల్వీర్ చరిత్ర

- గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బాక్సర్ల ప్రభంజనం
- మొత్తం 7 స్వర్ణాలు, 3 రజతాలతో సరికొత్త చరిత్ర
- రజతం గెలిచి మేరీ కోమ్, విజేందర్ సరసన చేరిన లవ్లీనా
- అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయుడిగా గుల్వీర్ రికార్డు
- 60 కేజీల విభాగంలో సచిన్, 80 కేజీల విభాగంలో అంకుశ్ స్వర్ణాలు కైవసం

**స్పోర్ట్స్ డెస్క్ :**

గ్లాస్గోలో జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల మోత మోగించింది. ముఖ్యంగా బాక్సింగ్‌లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో ఏకంగా 7 స్వర్ణాలు, 3 రజతాలు సాధించి సరికొత్త చరిత్ర సృష్టించారు. మరోవైపు, అథ్లెటిక్స్‌లో గుల్వీర్ సింగ్ అరుదైన ఘనతను అందుకున్నాడు.

శనివారం జరిగిన ఫైనల్స్‌లో అంకుశ్ పంఘాల్ (80 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు) సహా అరుంధతి, ప్రియ, సాక్షి, ప్రీతి, జైస్మిన్ స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ బాక్సింగ్‌లో భారత్ తన అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసింది. మహిళల 75 కేజీల విభాగం ఫైనల్‌లో ఒలింపిక్ పతక విజేత లవ్లీనా బొర్గొహెయిన్.. ఆస్ట్రేలియా బాక్సర్ ఎమ్మా స్యూ గ్రీన్‌ట్రీ చేతిలో 14 తేడాతో ఓడిపోయి రజతంతో సరిపెట్టుకుంది. అయినప్పటికీ, ఈ పతకంతో మేజర్ టోర్నమెంట్లన్నింటిలో పతకం సాధించిన మేరీ కోమ్, విజేందర్ సింగ్ సరసన లవ్లీనా చోటు దక్కించుకుంది. నరేందర్ (90+ కేజీలు), జదుమణి సింగ్ కూడా రజతాలు సాధించారు.

అథ్లెటిక్స్‌లో భారత స్టార్ రన్నర్ గుల్వీర్ సింగ్ చారిత్రక ప్రదర్శన చేశాడు. పురుషుల 5000 మీటర్ల పరుగులో 13:24.95 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరి కాంస్యం గెలుచుకున్నాడు. అంతకుముందు 10,000 మీటర్లలో రజతం సాధించిన గుల్వీర్, ఒకే కామన్వెల్త్ గేమ్స్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో రెండు పతకాలు గెలిచిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించాడు.



# టీమిండియాకు ఎదురుదెబ్బ.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు బుమ్రా కష్టమే!

- మోకాలి గాయంతో శ్రీలంక టెస్టు సిరీస్‌కు బుమ్రా దూరం
- ఇంగ్లండ్ పర్యటనలో అయిన గాయం నుంచి ఇంకా కోలుకోని బుమ్రా!
- వైద్యుల సూచనతో విశ్రాంతికి మొగ్గుచూపిన బీసీసీఐ
- బుమ్రా స్థానంలో అకిబ్ నబీని తీసుకునే అవకాశం
- ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత క్రికెట్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు ప్రధాన పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎడమ మోకాలిలో అసౌకర్యంతో బాధపడుతున్న అతనికి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరింత సమయం అవసరమని బీసీసీఐ వైద్య బృందం భావిస్తోంది. దీంతో ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఈ కీలక సిరీస్‌కు బుమ్రా సేవలు కోల్పోవడం దాదాపు ఖాయమైంది.

వివరాల్లోకి వెళ్తే, గత నెల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో బుమ్రా గాయపడ్డాడు. జులై 19న కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా అతని ఎడమ మోకాలికి దెబ్బ తగలడంతో వాపు వచ్చింది. అప్పటి నుంచి అతను బౌలింగ్‌కు దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE)లో ఉన్న బుమ్రా, ఇంకా బౌలింగ్ ప్రాక్టీస్ ప్రారంభించలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. "ఇప్పుడే అతడిని ఆడిస్తే గాయం తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉంది. అందుకే, బుమ్రా పూర్తిగా కోలుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ నేపథ్యంలో శ్రీలంక పర్యటనకు అతను దూరంగా ఉండొచ్చు" అని ఓ అధికారి ఐఏఎన్ఎస్‌కు తెలిపారు.

వాస్తవానికి, శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టెస్టు జట్టుకు బుమ్రాను ఎంపిక చేసినప్పటికీ, ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే తుది జట్టులో ఉంటాడని సెలక్టర్లు స్పష్టం చేశారు. ఇప్పుడు అతను దూరం కానుండటంతో, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతని స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించనుంది. జమ్మూ కశ్మీర్ సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ అకిబ్ నబీ ఈ రేసులో ముందున్నాడు. ఇటీవల రంజీ ట్రోఫీలో 60 వికెట్లతో సత్తాచాటిన నబీ, ఇండియాఏ తరఫున శ్రీలంక పర్యటనలోనూ రాణించాడు.

బుమ్రా గైర్హాజరీతో భారత పేస్ బౌలింగ్ విభాగంలో మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ మాత్రమే మిగిలారు. భారత జట్టు ఆగస్టు 4న శ్రీలంకకు బయలుదేరి వెళ్లనుంది.



అక్కడ ఆగస్టు 7 నుంచి 9 వరకు కొలంబోలో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుంది. అనంతరం గాలే వేదికగా ఆగస్టు 15న తొలి టెస్టు, కొలంబోలో ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు జరుగుతాయి.

# కెప్టెన్‌గా తిలక్ వర్మ.. దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ జట్టు ఇదే!

- దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ కెప్టెన్‌గా తిలక్ వర్మ ఎంపిక
- ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు
- గత రంజీ సీజన్ టాప్ స్కోరర్ స్మరణ్, కరుణ్ నాయర్‌కు జట్టులో చోటు
- గతేడాది ఫైనలిస్ట్ కావడంతో నేరుగా సెమీఫైనల్‌కు అర్హత
- ఈ నెల 23 నుంచి బెంగళూరు వేదికగా ఈ టోర్నమెంట్ ప్రారంభం

**స్పోర్ట్స్ డెస్క్ :**

దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీ కోసం సౌత్ జోన్ తమ జట్టును ప్రకటించింది. భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్, హైదరాబాద్ యువ సంచలనం తిలక్ వర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఆంధ్ర జట్టుకు చెందిన సీనియర్ బ్యాటర్ రికీ భుయ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE) వేదికగా ఈ టోర్నమెంట్ జరగనుంది. నేడు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీశ్ బాబు నేతృత్వంలో సెలక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఆంధ్ర మాజీ రంజీ ఆటగాడు ఆర్వీ చంద్రమౌళి ప్రసాద్ ఈ సెలక్షన్ ప్యానెల్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సమావేశంలో సౌత్ జోన్‌లోని ఏడు సభ్య సంఘాలైన ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, గోవా, పాండిచ్చేరి, కేరళ ప్రతినిధులు పాల్గొన్నారు. జట్టుకు హెడ్ కోచ్‌గా ఆంధ్రకు చెందిన అనుభవజ్ఞుడైన లెవల్ 2 కోచ్ ఎంఎన్ విక్రమ్ వర్మను నియమించారు.

15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో యువత, అనుభవం చక్కగా మేళవించారు. భారత జట్టుకు ఆడిన వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కింది. 2025/26 రంజీ ట్రోఫీ సీజన్‌లో 950 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన కర్ణాటక యువ ఆటగాడు ఆర్. స్మరణ్, హైదరాబాద్‌కు చెందిన కె. హిమతేజ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఇటీవలే జింబాబ్వేపై 30తో టీ20 సిరీస్ గెలిచిన భారత జట్టులో తిలక్ వర్మ సభ్యుడిగా ఉన్నాడు.

శ్రీలంక 'ఎ'తో సిరీస్ గెలిచిన భారత 'ఎ' జట్టులో సభ్యులుగా ఉన్న షేక్ రషీద్ (ఆంధ్ర), ఎన్. జగదీశన్ (తమిళనాడు) కూడా ఈ జట్టులో ఉన్నారు. వికెట్ కీపింగ్ బాధ్యతలను జగదీశన్ నిర్వర్తించనున్నాడు. గోవా బ్యాటర్ అభినవ్ తేజ్రానా కూడా జట్టులో స్థానం సంపాదించాడు.



గత ఎడిషన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు చేరి సెంట్రల్ జోన్ చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ కారణంగా ఈసారి నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఆగస్టు 30న బీసీసీఐ సీఓఈ గ్రౌండ్ 2లో జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లో క్వార్టర్‌ఫైనల్ 2 విజేతతో సౌత్ జోన్ తలపడుతుంది. బౌలింగ్ విభాగం కూడా పటిష్ఠంగా ఉంది. స్పిన్ బాధ్యతలను లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్, లెగ్ స్పిన్నర్ శ్రేయాస్ గోపాల్ పంచుకోనున్నారు. పేస్ విభాగంలో కె. సాయితేజ, త్రిపురాన విజయ్, విద్వత్ కావరప్ప, ఎం.డి. నిదీశ్ ఉన్నారు.

**సౌత్ జోన్ జట్టు:**
ఎన్. తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్ (వైస్ కెప్టెన్), అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె.ఎం. హిమతేజ, ఆర్. స్మరణ్, ఎన్. జగదీశన్ (వికెట్ కీపర్), కరుణ్ నాయర్, తనయ్ త్యాగరాజన్, శ్రేయస్ గోపాల్, కె. సాయితేజ, టి. విజయ్, విద్వత్ కావరప్ప, హెచ్. అమన్ ఖాన్, ఎం.డి. నిదీశ్.

# నా లక్ష్యం అది కాదు.. ఇప్పుడు కేవలం దాని కోసమే ఆడుతున్నా

- టీమిండియాలోకి పునరాగమనం తన లక్ష్యం కాదన్న భువీ
- కేవలం ఆటపై ఉన్న ఇష్టంతోనే క్రికెట్ ఆడుతున్నట్లు వెల్లడి
- జట్టులో లేనందుకు ఎలాంటి పశ్చాత్తాపం లేదన్న పేసర్
- భారత పేస్ బౌలింగ్ ఎదుగుదలకు కోహ్లీ, రవిశాస్త్రి కారణమని వ్యాఖ్య

**స్పోర్ట్స్ డెస్క్ :**

టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్, భవిష్యత్తు ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జాతీయ జట్టులోకి తిరిగి రావాలన్నదే ఇప్పుడు తన ప్రధాన లక్ష్యం కాదని, కేవలం ఆటపై ఉన్న ప్రేమతోనే క్రికెట్ కొనసాగిస్తున్నానని స్పష్టం చేశాడు. భారత జట్టుకు దూరమైన జీవితంతో తాను సంతృప్తిగా ఉన్నానని, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటను ఆస్వాదిస్తున్నానని తెలిపాడు.

36 ఏళ్ల భువనేశ్వర్ చివరిసారిగా 2022లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటివరకు 21 టెస్టులు, 121 వన్డేలు, 87 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున ఆడి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఆర్‌సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. "దేశం తరఫున ఆడాలన్న నా కల ఇప్పటికే నెరవేరింది. ఇప్పుడు మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. మళ్లీ అవకాశం వస్తే గొప్ప విషయమే. కానీ, దానికోసం ఒత్తిడికి గురికావడం లేదు. ప్రస్తుతం నేను ఆడుతున్నది కేవలం ఆటపై ఉన్న ఇష్టం, క్రమశిక్షణతోనే" అని వివరించాడు. ఐపీఎల్, దేశవాళీ క్రికెట్, యూపీ టీ20 లీగ్‌లలో ఆడుతూ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నట్లు తెలిపాడు.

జట్టులో చోటు కోల్పోయినందుకు తనకెలాంటి పశ్చాత్తాపం లేదని, ఈ విషయంలో తన కుటుంబం అందించిన మద్దతు ఎంతో కీలకమని భువీ పేర్కొన్నాడు. "ఇంట్లో మేము క్రికెట్



గురించి అస్సలు మాట్లాడుకోము. జట్టులో నా స్థానం గురించి, నన్ను ఎందుకు ఎంపిక చేయలేదనే చర్చలు ఉండవు. క్రీడల్లో తరాల మార్పు సహజమని నేను అర్థం చేసుకున్నాను. ఈ పరిస్థితిని ఎదుర్కొన్న మొదటి ఆటగాడిని నేను కాదు, చివరివాడినీ కాను. అందుకే నేను ఉన్న స్థితిలో సంతోషంగా ఉన్నాను" అని అన్నాడు.

భారత్‌లో ఫాస్ట్ బౌలింగ్ విప్లవానికి ఐపీఎల్‌తో పాటు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ, మాజీ కోచ్ రవిశాస్త్రిలే కారణమని భువనేశ్వర్ ప్రశంసించాడు. "భారత పేస్ దళాన్ని నిర్మించాలనే స్పష్టమైన విజన్‌తో కోహ్లీ, శాస్త్రి పనిచేశారు. విదేశీ పర్యటనలకు ముందు స్వదేశంలో కూడా పేసర్లకు అనుకూలించే పిచ్‌లను తయారు చేయించి మమ్మల్ని సిద్ధం చేశారు. అలాంటి చిన్న నిర్ణయాలే పెద్ద మార్పులకు కారణమయ్యాయి" అని గుర్తుచేసుకున్నాడు. తన చిన్నతనంలో మీరట్‌లోని అకాడమీలో సీనియర్ అయిన ప్రవీణ్ కుమార్ బౌలింగ్‌ను చూసి ఎంతో నేర్చుకున్నానని, అతని బౌలింగ్ శైలి తనపై చాలా ప్రభావం చూపిందని భువనేశ్వర్ చెప్పుకొచ్చాడు.

# 9న మహేశ్ బాబు పుట్టిన రోజు

## వారణాసి నుంచి అప్‌డేట్ కోసం అభిమానుల చూపు



సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నెల ఆగస్టు వచ్చేసింది. ప్రతి ఏడాది ఆగస్టు 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో సందడి నెలకొంటుంది. ఈసారి కూడా అభిమానులు ఎస్ఎస్ఎంబీ మంత్ పేరుతో సెలబ్రేషన్స్ ప్రారంభించగా, అందరి దృష్టి ఇప్పుడు ఒకే విషయంపై ఉంది.. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా నుంచి ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందా అని చూస్తున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. అడ్వెంచర్ నేపథ్యంలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి నెలకొంది. మహేష్ బాబు కూడా ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్, ప్రత్యేకమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపించనున్నట్లు సమాచారం. చిత్ర బృందం ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కీలక భాగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మరికొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా లుక్ గోప్యంగా ఉండేలా రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అందుకే మహేష్ బాబు ఇటీవల కాలంలో పబ్లిక్ ఈవెంట్లకు కూడా చాలా తక్కువగా హాజరవుతున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన పోస్టర్, టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా 'వారణాసి' నుంచి ప్రత్యేక అప్‌డేట్ ఉంటుందనే ఆశతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.



# భారత్‌లో 'స్పైడర్ మ్యాన్' సునామీ...

## రూ. 500 కోట్ల క్లబ్‌పై మార్వెల్ కన్ను

హాలీవుడ్ సినిమాలకు భారతదేశంలో ఎప్పటి నుంచో మంచి ఆదరణ ఉంది. కానీ మార్వెల్ సినిమాల విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ప్రతి కొత్త రిలీజ్ లను అభిమానులు ఒక పండుగలా మార్చేస్తుంటారు. ఇప్పుడు అదే జోష్‌ను మరింత భారీ స్థాయిలో కొనసాగిస్తూ వచ్చిన 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' భారత బాక్సాఫీస్ వద్ద సంచలన ప్రదర్శన కనబరుస్తోంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన స్పందన అందుకున్న ఈ మూవీ ఇప్పుడు హాలీవుడ్ చిత్రాల చరిత్రనే తిరగరాసే దిశగా దూసు కెళ్తోంది. భారీ ఓపెనింగ్‌తోనే కాదు, రోజురోజుకూ పెరుగుతున్న వసూళ్లతో ట్రేడ్ వర్గాలను కూడా ఆశ్చ ర్యానికి గురిచేస్తోంది. ఇప్పుడు అందరి దృష్టి ఈ సినిమా నిజంగానే భారతదేశంలో తొలి రూ.500 కోట్ల హాలీవుడ్ మూవీగా నిలుస్తుందా ? అనే ప్రశ్నపైనే ఉంది. టామ్ హాలండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మార్వెల్ మూవీ విడుదలైన తొలి మూడు రోజుల్లోనే సుమారు రూ.207 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసింది. ఇందులో రూ.171 కోట్ల నెట్ కలెక్షన్లు ఉన్నాయి. భారత బాక్సాఫీస్ లెక్కల్లో 3డీ ఛార్జీలు ప్రత్యేకంగా పరిగణించబడటంతో, వాటిని కలుపుకుంటే మొత్తం గ్రాస్ వసూళ్లు ఇప్పటికే రూ.227 కోట్లకు చేరు కున్నాయి. ముఖ్యంగా శనివారం ఒక్కరోజే సుమారు రూ.81 కోట్ల గ్రాస్, రూ.67 కోట్ల నెట్ వసూళ్లు సాధించడం విశేషం. శుక్రవారంతో పోలిస్తే దాదాపు 45 శాతం పెరుగుదల నమోదు కావడం అరుదైన విషయంగా ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో శనివారం బాక్స ఆఫీస్ వసూళ్లు మళ్లీ తొలి రోజు స్థాయిని అందుకోగా, ఉత్తర భారత మెట్రో నగరాల్లో సినిమా మరింత బలంగా పుంజుకుంది. ముఖ్యంగా ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో తొలి రోజుతో పోలిస్తే దాదాపు 40 శాతం ఎక్కువ వసూళ్లు నమోదయ్యాయి. ఇతర హిందీ మార్కెట్లలో కూడా ఇదే ధోరణి కనిపించింది. ముందస్తు బుకింగ్‌లు కూడా భారీ స్థాయిలో కొనసాగడంతో ఆదివారం కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రేడ్ అంచనాల ప్రకారం ఆదివారం వసూళ్లు రూ.90 కోట్లను దాటే అవకాశం ఉంది. 3డీ ఛార్జీలను కలుపుకుంటే అది దాదాపు రూ.100 కోట్లకు చేరుకునే అవకాశముంది. ఈ లెక్కలు నిజమైతే తొలి వారాంతంలోనే సినిమా రూ.275 కోట్ల నుంచి రూ.300 కోట్ల మధ్య గ్రాస్ వసూళ్లు నమోదు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. హాలీవుడ్ చిత్రాలకు ఇది భారత బాక్సాఫీస్ చరిత్రలో అత్యంత భారీ ప్రారంభాల్లో ఒకటిగా నిలవనుంది. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్‌లలో కనిపించిన భారీ స్పందన, ప్రధాన నగరాల్లో వరుస హౌస్‌ఫుల్ షోలు, తెలుగు, హిందీ, తమిళం, ఇంగ్లీష్ భాషల్లో వచ్చిన మంచి ఆక్యుపెన్సీ ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

## పూజాహెగ్డే పెళ్లికి గ్రీన్ సిగ్నల్!



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు గ్లామర్‌తో నటనతో అలరించిన నటి పూజాహెగ్డే వ్యక్తిగత జీవితానికి సంబం ధించిన ఓ ఆసక్తికర వార్త వైరల్ అవుతోంది. తాజాగా అమ్మడు వివాహం గురించి ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పూజాహెగ్డే పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతుందంటూ బాలీవుడ్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా పూజాహెగ్డేకు సరైన అవకాశాలు రాని సంగతి తెలిసిందే. దీంతో అమ్మడు కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పూజ తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లికి సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇండస్ట్రీకి చెందినవారా ? వ్యాపార రంగం నుంచి ఎవరైనా వస్తారా? అనే దానిపై క్లారిటీ లేదు గానీ.. కుటుంబ సభ్యులు మాత్రం మంచి వరుడిని వెతికే పనిలో నిమగ్నమైనట్లు ప్రచారం జరుగుతోంది. పూజాహెగ్డే తల్లిదండ్రులు తగిన వరుడిని అన్వేషిస్తున్నారని.. త్వరలోనే ఈ విషయమై కుటుంబ సభ్యుల సమక్షంలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. నటిగా ఎన్నో విజయాలను అందుకున్న పూజాహెగ్డే ఇప్పుడు జీవితంలో కొత్త దశలోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకోవడం పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పూజాహెగ్డే ప్రేమ వ్యవహారాలకు సంబంధించి పలుపుకార్లు రూమర్స్ వినిపించినప్పటికీ వాటిని ధృవీకరించలేదు. కెరీర్ పట్ల పూర్తి ఏకాగ్రత పెట్టిన అమ్మడు ఇప్పుడు కుటుంబం కోరిక మేరకు వివాహానికి సిద్ధమవ్వడం విశేషం. వివాహం తర్వాత కూడా సినిమాలు కొనసాగిస్తారా లేదా అనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రస్తుతం పెళ్లి వార్త నెట్టింట మార్మోగిపోతోంది. గ్లామరస్ హీరోయిన్‌గా టాలీవుడ్, బాలీవుడ్‌లలో స్టార్ హీరోల సరసన నటించిన పూజాహెగ్డే అందచందాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

## టాక్సిక్ ట్రైలర్ 8న గ్రాండ్‌గా విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. ్ర తూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉ న్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ (మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.

## ఓటీటీలోకి రష్మిక, కృతి సనన్, షాహిద్ ల ట్రయాంగిల్ లవ్ స్టోరీ..



ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్ తో ప్రేక్షకులను ఆకట్టుకున్న బాలీవుడ్ రొమాంటిక్ కామెడీ డ్రామా 'కాక్‌టెయిల్ 2'. థియేటర్లలో మంచి విజయాన్ని నమోదు చేసిన ఈ మూవీ ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. షాహిద్ కపూర్, రష్మిక మందన్నా, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ మూవీకి హోమీ అదాజానియా దర్శకత్వం వహించారు. జూన్ 19న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.140 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. 2026లో అత్యధిక వసూళ్లు సాధించిన బాలీవుడ్ చిత్రాల్లో ఒకటిగా నిలిచిన ఈ మూవీ, ప్రేక్షకుల నుంచి కూడా మంచి స్పందన అందుకుంది. ఐఎమ్‌డీబీలో 7.6 రేటింగ్ సాధించడం కూడా దీనికి లభించిన ఆదరణ ఎలాంటిదో తెలుస్తోంది.

### నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్

2012లో విడుదలైన సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె, డయానా పెంటీ నటించిన 'కాక్‌టెయిల్' సినిమాతో ఈ చిత్రానికి టైటిల్ పరంగా మాత్రమే సంబంధం ఉంది. ఇది ఆ కథకు సీక్వెల్ కాదు, కొత్త కథతోనే ఈ సినిమాను రూపొందించారు. థియేట్రికల్ రన్ విజయవంతంగా ముగిసిన తర్వాత ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా విడుదల తేదీని కూడా ప్రకటించింది. ఆగస్టు 14 నుంచి 'కాక్‌టెయిల్ 2' నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. ఈ మూవీ హిందీతో పాటు తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళంలో కూడా అందుబాటులోకి వస్తోంది. థియేటర్లలో ఈ రొమాంటిక్ డ్రామాను మిస్ అయిన వారు ఇప్పుడు ఇంట్లోనే ఈ ప్రేమకథను ఆస్వాదించే అవకాశం పొందనున్నారు.

### సినిమా కథ

ఈ స్టోరీలో కునాల్ పాత్రలో షాహిద్ కపూర్, దియా పాత్రలో రష్మిక మందన్నా కనిపిస్తారు. ఇద్దరూ చాలా కాలంగా సహజీవనం చేస్తుంటారు. పెళ్లి గురించి కుటుంబ సభ్యుల ఒత్తిడికి దూరంగా ఉండాలని భావించి ఇటలీలోని అందమైన సిసిలీ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్తారు. అక్కడ దియా తన పాత స్నేహితురాలు అల్లీని కలుస్తుంది. తన ప్రేమికుడి నమ్మకాన్ని పరీక్షించాలని భావించిన దియా, అల్లీతో కునాల్‌ను కొద్దిగా ఫ్లర్ట్ చేయమని కోరుతుంది. అయితే సరదాగా మొదలైన ఆ పరీక్ష అనూహ్య మలుపు తిరుగుతుంది. అల్లీ నిజంగానే కునాల్‌పై ప్రేమలో పడటంతో ముగ్గురి జీవితాలు త్రికోణ ప్రేమకథగా మారిపోతాయి. ఆ తర్వాత జరిగే పరిణామాలు కూడా హైలెట్ గా ఉంటాయి. క్లైమాక్స్ ఏమిటో తెలుసుకోవాలంటే ఈ మూవీపై ఓ లుక్ వేయాల్సిందే . ఇక రష్మిక మందన్నా ఈ సినిమాలో ఎమోషనల్ పాత్రలో ఆకట్టుకోగా, కృతి సనన్ పాత్ర కూడా గ్లామర్ డోస్ తో అలరించింది. షాహిద్ కపూర్ తన యాక్టింగ్ తో కథను ముందుకు నడిపించాడు. ఈ ముగ్గురి కెమిస్ట్రీ సినిమాకు హైలెట్ గా నిలిచింది. ఇందులో టికూ తల్సానియా కీలక పాత్రలో నటించగా, పుల్కిత్ సమ్రాట్ ప్రత్యేక పాత్రలో కనిపించారు. ప్రేమ, నమ్మకం, అపార్థాలతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులకు వినోదంతో పాటు ఆలోచింపజేసే అంశాలను కూడా అందిస్తుంది.

## లవ్, బ్రేకప్ వార్తలపై అనుపమ పరమేశ్వరన్ స్పందన

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తమిళ్ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో తన లవ్ లైఫ్, బ్రేకప్ వార్తలపై వస్తున్న ఊహాగానాలపై ఎట్టకేలకు స్పందించింది. నెట్టింట వైరల్ అవుతున్న రూమర్లకు స్వస్తి పలుకుతూ ఆమె చేసిన ఎమోషనల్ కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గత ఏడాది కాలంగా తన జీవితంలో అనేక ఒడిదుడుకులు, మానసిక సంఘర్షణలు ఎదుర్కొన్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సమయంలో అత్యంత కష్టమైన పరిస్థితులను దాటుకుని ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపింది. "గత ఏడాది నా జీవితంలో అత్యంత సంక్లిష్టమైన, కష్టతరమైన ఘట్టం నడిచింది. ఆ కష్టాలను దాటుకుని, ఇప్పుడు మళ్లీ నా జీవితంలో సంతోషం, ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నాను" అని అనుపమ పేర్కొంది. పరిస్థితులు ఎలా ఉన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం, స్వీయ స్వేచ్ఛను ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని చెబుతూ... అభిమానులు, శ్రేయోభిలాషులు అందించిన మద్దతుకు ధన్యవాదాలు తెలిపింది. తమిళ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో ప్రేమాయణం, తదనంతర బ్రేకప్ వార్తలపై మీడియాలో రకరకాల కథనాలు షికారు చేస్తున్న నేపథ్యంలో, ఆమె పరోక్షంగా ఇచ్చిన ఈ స్పష్టతతో ఆ పుకార్లన్నింటికీ తెరపడినట్లయింది.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,
Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com